
ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

గుడివాడలో ఘోరం

ఆర్టీసీ బస్సు కిందపడి ముగ్గురు యువకుల దుర్మరణం

మృతులు


సోహైల్


హర్ష


సాయి

గుడివాడ, ఫిబ్రవరి 5 : గుడివాడలోని బస్టాండ్ సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. సేకరించిన వివరాల ప్రకారం.. సోహైల్ (24), సాయి (23), హర్ష.. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కోతిబొమ్మ సెంటర్ వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. స్థానిక ఈవీఆర్ ఆసుపత్రి వద్ద డివైడర్ నుంచి తిరిగి బస్టాండ్ వైపునకు బండిని తిప్పారు. అయితే, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించలేదు. దీంతో ఏపీ 03 జెడ్ 5091 నెంబరు కలిగిన బస్సు వారిని బలంగా ఢీకొంది. సుమారు 100 అడుగుల మేర ఈడ్చుకెళ్లింది. దీంతో ఘటనాస్థలంలోనే యువకులు మృతిచెందారు. మృతులు ఇద్దరు స్థానిక ముబారక్ సెంటర్‌కు చెందిన వారు కాగా, మరొకరు కాకర్ల వీధికి చెందినవారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృత్యువులోనూ కలిసే..

మృతులు ముగ్గురూ మంచి స్నేహితులు. మృత్యువు కూడా వీరి స్నేహాన్ని విడదీయలేకపోయింది. సోహైల్ స్థానికంగా ఒక వాటర్ ప్లాంట్‌లో ఆటోడ్రైవర్ కం డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. హర్ష బైక్ మెకానిక్‌గా ఉంటూ 17 ఏళ్ల వయసులో కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. సాయి స్థానిక 9వ వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తమకు అండగా ఉంటారనుకున్న కుమారులు కంటి ముందు అచేతనంగా పడి ఉండటంతో వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

వెనిగండ్ల ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదంలో యువకులు మృతిచెందిన విషయాన్ని తెలుసుకుని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

'నాపై కొందరు కుట్రపూరితంగా చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి జగన్ నమ్మారు. నన్ను అవమానకరంగా మాట్లాడారు. ఇద్దరు కమ్మ వ్యక్తులను పక్కన పెట్టుకుని మట్టి, బూడిదను దోచుకుంటున్నావా.. అని సీఎం నిలదీశారు. నేను చెప్పే సమాధానం కూడా వినిపించుకోలేదు. నా ప్రమేయం లేకుండానే ఆ వ్యక్తులు కొత్తూరు తాడేపల్లి నుంచి లక్షలాది లారీల మట్టిని రవాణా చేశారు. ఇవేమీ వినకుండా నన్ను అవమానించిన పార్టీలో నేను ఉండకూడదని నిర్ణయించుకున్నా. ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తా.' - వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, సమావేశానికి హాజరైన మైలవరం వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

వైసీపీలో ఉండలేను!

దోచుకుంది పెడన నాయకుడు.. పేరేమో నాకు

- బూడిద, మట్టి మొత్తం దోచేసింది ఆయనే..
- జోగి రమేశ్‌పై పరోక్షంగా నిప్పులు చెరిగిన వసంత

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నందిగామ) : మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వైసీపీని వీడుతున్నట్టు ప్రకటించారు. నందిగామ మండలం ఐతవరంలో మైలవరం నియోజకవర్గ పార్టీ నేతలతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ పాలనపైనా, పార్టీలో తనకు జరిగిన అవమానాలపైనా ఆయన తన అనుచరులతో సుదీర్ఘంగా మాట్లాడారు. మంత్రి జోగి రమేశ్ పేరు ప్రస్తావించకుండా ఆయనపై నిప్పులు చెరిగారు. ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే... మైలవరం ఎమ్మెల్యేగా నన్ను పని చేయనీయకుండా పెడన నాయకుడు, ఆయన మనుషులు పెత్తనం చేశారు. ఆ వ్యక్తులు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారితో చేతులు కలిపి నాపై కుట్రలు చేశారు. వీటీపీఎస్ బూడిద, కొత్తూరు తాడేపల్లి మట్టిని పెడన నుంచి గెలిచిన నాయకుడు, ఆయన మనుషులు దోచుకున్నారు. ఆ నేరాన్ని నాపై మోపే ప్రయత్నం చేశారు.

బూడిదను డబ్బుకు అమ్ముకున్నారు..

యాష్ పాండ్ నుంచి బూడిదను డబ్బుకు అమ్ముకుని సొమ్ము చేసుకుంది కూడా వాళ్లే. అటువంటి వ్యక్తులను అధిష్ఠానం ప్రోత్సహిస్తూ నన్ను ఇబ్బంది పెట్టడాన్ని సహించలేక వైసీపీలో ఇమడలేనని నిర్ణయించుకున్నా. ఎమ్మెల్యేగా నాకు ప్రభుత్వం సహకరించకపోయినా అభివృద్ధి చేశా. పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వని సమయంలో ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు మైలవరానికి నిధులు ఇచ్చారు. నేను వైసీపీని వీడుతున్నాను. త్వరలో రాజీనామా ఇస్తా. ఏ పార్టీలో చేరేది త్వరలో చెబుతా.. అన్నారు.

టీడీపీ, జనసేన, కాంగ్రెస్ నుంచి ఆహ్వానం

నన్ను నమ్ముకుని ఉన్నవారు ఇష్టం ఉంటే నా వెంట నడవాలి. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి నాకు ఆహ్వానం ఉంది. మంచి పాలన కోసం త్వరలో నా నిర్ణయాన్ని వెల్లడిస్తా. నాపై తప్పుడు ఆరోపణలు చేసేందుకు వైసీపీ సోషల్ మీడియా సిద్ధంగా ఉంది. సొంత తల్లిని, చెల్లిని వదలని వారు నన్ను వదులుతారని అనుకోవడం లేదు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నా అని మైలవరం ఎమ్మెల్యే వసంత తెలిపారు. ఈ సమావేశానికి మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్దఎత్తున నేతలు తరలివచ్చారు. పలు మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, మండల వైసీపీ అధ్యక్షులు హాజరయ్యారు.

8 తర్వాత టీడీపీలోకి..

వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈనెల 8వ తేదీ తర్వాత ఆయన టీడీపీ కండువా కప్పుకోనున్నారని సమాచారం. మైలవరం లేదా పెనమలూరు స్థానాల్లో ఏదో ఒకదాని నుంచి పోటీ చేస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

పరిహారం ప్రహసనమే!


దెబ్బతిన్న వరి పంట

ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే పంట నష్టపరిహారం విడుదల ఇప్పట్లో లేనట్టే

- సంక్రాంతి నాటికి పరిహారం ఇస్తామని గతంలో పాలకుల హామీ
- ఇప్పటికీ అతీగతీ లేని దుస్థితి
- జిల్లాలో 58,835 హెక్టార్లకు రూ.99 కోట్లకు పరిహారంగా చెల్లించాలని తుది నివేదిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మిచౌంగ్ తుపాను కారణంగా గతేడాది డిసెంబరు 4, 5 తేదీల్లో కురిసిన భారీవర్షాలకు వరి, ఇతర పంటలకు జరిగిన నష్టం వివరాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందితో కూడిన బృందాలు తయారుచేశాయి. ఈ జాబితాలను ఆధారంగా చేసుకుని రైతుల పేరుతో గ్రామ, మండల, ఇతర మండలాల్లో, ఇతర జిల్లాల్లో ఉన్న భూమి వివరాలను ఈ-క్రాప్, ఆధార్‌కార్డు నెంబర్ల ఆధారంగా సేకరించారు. ఒక రైతు ఎంత భూమి సాగుచేసినా ఐదు ఎకరాలకు మాత్రమే పంట నష్టపరిహారం పరిమితం చేస్తూ జాబితాలను సరిదిద్దారు. జిల్లాలో తొలి విడతగా తయారు చేసిన పంట నష్టపరిహారం జాబితాల్లో 83,462 హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్టుగా చూపారు. రూ.141.56 కోట్లను పంట నష్టపరిహారంగా అందించాల్సి ఉంటుందని నివేదికను తయారుచేశారు. ఒక రైతుకు ఐదు ఎకరాలకు మించి పంటనష్టపరిహారం మాత్రమే ఇచ్చే నిబంధన ప్రకారం జిల్లాలో 58,835 హెక్టార్లకు రూ.99 కోట్లకు మాత్రమే పరిహారం ఇవ్వాలని తుది జాబితాలను తయారు చేశారు. పంట నష్టపరిహారాన్ని రూ.99 కోట్లకు కుదించారు. అన్ని పంటలకు కలిపి గతంలో రూపొందించిన జాబితాలకన్నా 26,224 హెక్టార్లకు పంట నష్టపరిహారం రాదని లెక్కలు తేల్చారు. వరి, వేరుశెనగ, పత్తి పంటలకు హెక్టారుకు పంట నష్టపరిహారంగా రూ.17వేలు, మొక్కజొన్నకు రూ.12వేలు, మినుముకు రూ.10వేలు చొప్పున పంట నష్టపరిహారంగా ఇవ్వాల్సి ఉంది.

మిచౌంగ్ తుపాను కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు ఇప్పట్లో పరిహారం అందేలా లేదు. ఈనెల మూడో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై కోడ్ అమల్లోకి వస్తే పంట నష్టపరిహారం అందదు. సంక్రాంతి నాటికి పరిహారం రైతుల ఖాతాల్లో జమచేస్తామని పాలకులు చెప్పినా ఇంతవరకు జమ కాలేదు. నేతలంతా సీట్ల కొట్లాటలో ఉండటంతో రైతులకు పంట నష్టపరిహారం విడుదల చేస్తారా? లేక మిన్నకుండి పోతారా? అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపరిహారం విడుదల అవుతుందా?

రైతులు ఈ ఏడాది సాగుచేసిన అన్ని పంటలు తుపాను కారణంగా అధిక శాతం దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావంతో రైతులు పంటలు కోల్పోయిన తీరును కేంద్ర బృందం సభ్యులు, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్, జేసీ స్వయంగా పరిశీలించారు. మోపిదేవి, పామర్రు తదితర మండలాల్లో నీటిలో మునిగి కంకులు మొలకెత్తడంతో రైతులు పంటను కోయకుండానే దమ్ము చేయించారు. రైతులు రెండో పంటను సాగు చేసుకునేందుకు వీలుగా పంట నష్టపరిహారాన్ని సంక్రాంతి పండుగ నాటికి విడుదల చేస్తామని ప్రకటించారు. అయినా పంట నష్టపరిహారం విడుదలపై ఎవరూ పెదవి విప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారుల జాబితాలను ప్రభుత్వానికి పంపామని, నగదు ఎప్పుడు విడుదల అవుతుందో తెలియదని చెప్పడం గమనించదగ్గ అంశం.



మరింత ఎత్తుకు వెళ్లాలని..

ఎస్పీ జాషువాకు ఘన వీడ్కోలు

మచిలీపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ పి.జాషువాకు పోలీసులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీని భుజాలపై ఎత్తుకుని ఊరేగించారు. ఎస్పీ దంపతులను గుర్రపుబండిపై ఎక్కించి తాడుతో లాగారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు పరేడ్ గ్రౌండులో ఏఆర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జాషువా మాట్లాడుతూ తనకు పోలీసులు, ఏఆర్ పోలీసులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• ఉద్రిక్తత


చల్లపల్లి మండలం నడకుదురు రేవులో ఇసుక తవ్వకాల వివాదం సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. పాగోలు లే అవుట్‌కు మెరక పేరుతో రాత్రివేళ ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేపట్టి బయట విక్రయిస్తున్నారంటూ రైతులు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తవ్వకాలను అడ్డుకోగా, తమ లే అవుట్‌కు ఇసుక రవాణా నిలిచిపోవటంతో పాగోలు లబ్ధిదారులు సోమవారం రేవు దగ్గరకు వచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. - 4లో..

నా కుమారుడికివ్వండి

- ముఖ్యమంత్రిని కోరిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు
- అవనిగడ్డ సీటు కేటాయింపులో మరో మలుపు

- 4లో..

పింఛన్ టెన్షన్!

- వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని 80 మందికి నిలిపివేత
- ప్రభుత్వం ఆదుకోవాలని మోపిదేవి లబ్ధిదారుల ఆవేదన

భూ కబ్జా చేసి నాపై నిందలా..!

» వెలంపల్లిపై బొండా ఉమా ఫైర్



ఆధారాలు చూపుతున్న బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 5 : మంత్రి పదవిలో ఉండగా దేవదాయ శాఖ భూములు అనుచరుల పేర కైంకర్యం చేసిన వెలంపల్లి శ్రీనివాస్ తిరిగి కబ్జా పేరుతో నిందలు తనపై వేయాలని చూస్తే సహించేది లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యనారాయణపురంలోని ఆలయ భూమి కబ్జాకు ప్రయత్నించినట్టు వెలంపల్లి చేసిన ఆరోపణలను ఉమా తీవ్రంగా ఖండించారు. ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఉమా మాట్లాడుతూ, సత్యనారాయణపురంలోని భూమిని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత శాఖకు 2020వ సంవత్సరంలో కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే స్థలాన్ని దేవదాయ శాఖకు స్వాధీనం చేయకుండా అప్పటి మంత్రిగా ఉన్న వెలంపల్లి తన అనుచరుడు భువనేశ్వరి పీఠం ధర్మకర్త దుమ్మలపాటి చంద్రశేఖర్‌కు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని మరుగునపెడుతూ తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల లబ్ధి కోసం తనపై అవాకులు చవాకులు పేలితే ప్రజల సమక్షంలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. తనపై వెలంపల్లి కబ్జా ఆరోపణ అవాస్తవమని నిరూపించానని, అలాగే వెలంపల్లి అనుచరులకు దేవదాయశాఖ భూమిని కట్టబెట్టారన్న విషయాన్ని అబద్ధమని నిరూపించాలన్నారు. వెలంపల్లి రెచ్చగొట్టే వ్యాఖ్యలపై స్పందనలో నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నవనీతం సాంబశివరావు, గార్లపాటి విజయ్‌కుమార్, దాసరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ దిల్లీరావు, జేసీ

స్పందన అర్జీదారుల సంతృప్తే ప్రధానం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 5 : జిల్లాలో జగనన్నకు చెబుదాం-స్పందనలో అందిన ప్రతి అర్జీని అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 160 అర్జీలు రాగా, వీటిలో రెవెన్యూ 80, పోలీస్ 29, పౌరసరఫరాలు 7, ఎంఏయూడీ 5, హౌసింగ్ 5, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 4, డీఆర్‌డీఏ 4, పంచాయితీరాజ్ 4, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 3, ఏపీసీపీడీసీఎల్ 3 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ఠ సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

స్పందన అర్జీలు పరిష్కరించండి

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం జేసీ గీతాంజలి శర్మ, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 159 అర్జీలను ప్రజలు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, ముడా వీసీ ఎం.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీఎస్‌వో పార్వతి, డీఈవో తాహెరా సుల్తానా వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారం : ఎస్పీ



మచిలీపట్నం టౌన్ : ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా నూతన ఎస్పీ అద్నన్ నయీం అస్మి అన్నారు. స్పందనలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఎక్కువగా భూ వివాదాలు, అత్తింటి వేధింపులు ఎస్పీ దృష్టికి వచ్చాయి.



డీఈవో కార్యాలయం ముట్టడించిన మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు

మధ్యాహ్న భోజన మెనూ ధరలు పెంచాలి

» కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 : మెనూ ధరలు పెంచాలంటూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. సంఘ కార్యదర్శి సమ్మక్క ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ర్యాలీగా డీఈవో కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా సమ్మక్క మీడియాతో మాట్లాడారు. పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన వాగ్దానం నెరవేరలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీసం మెనూ చార్జీలు కూడా పెంచడం లేదన్నారు. ప్రభుత్వం వంటగ్యాస్‌ను సరఫరా చేయాలని, ఇందుకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆందోళనలో సంఘ అధ్యక్షుడు ఎం.మురళి, శ్రామిక మహిళా కన్వీనర్ ధనశ్రీ, సీఐటీయూ నాయకులు కె.వెంకటేశ్వరరావు, బి.సుబ్రహ్మణ్యం, సీహెచ్.జయరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఈవోకు సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

నర్సులకు పెరుగుతున్న ప్రాధాన్యత

» నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం మెడికల్ కళాశాల ఆవరణలో నర్సింగ్ కళాశాలను సోమవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ, కెమికల్స్ ఫెర్టిలైజర్స్ మంత్రిత్వ శాఖ మంత్రి డాక్టర్ మున్సుక్ మాండవియా వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఆసుపత్రుల్లో నర్సులకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డీవీఎల్ నరసింహం, ఆర్డీవో ఎం.వాణి, పరిశీలకులు ధీరజ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజా రమణి, ఆశాలత, సూపరింటెండెంట్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు.. అడ్డుకున్న రైతులు

» తరలి వచ్చిన పాగోలు లే అవుట్ లబ్ధిదారులు

» రైతుల అభ్యంతరం.. ఇరుపక్షాల వాగ్వాదం

» నడకుదురు రేవులో ఉద్రిక్త వాతావరణం



తహసీల్దార్ సుమతితో మాట్లాడుతున్న ఇరుపక్షాల పెద్దలు

చల్లపల్లి, ఫిబ్రవరి 5 : చల్లపల్లి మండలం నడకుదురు రేవులో ఇసుక తవ్వకాల వివాదం సోమవారం ఉద్రిక్తతలకు దారితీసింది. పాగోలు లేఅవుట్ మెరక పేరుతో రాత్రి వేళ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి బయటకు విక్రయిస్తున్నారంటూ రైతులు శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలను అడ్డుకున్న విషయం తెలిసిందే. లేఅవుట్‌కు ఇసుక రవాణా నిలిచిపోవటంతో పాగోలు లబ్ధిదారులు సోమవారం ఉదయం నడకుదురు రేవుకు తరలివచ్చారు. గ్రామ సర్పంచ్ తోటశ్రీనివాసరావు లబ్ధిదారులకు మద్దతుగా అక్కడకు వచ్చారు. స్థానిక రైతాంగం, నాయకులతో తొలుత చర్చలు జరపగా, తవ్వకాలను ఒప్పుకోబోమని వారు తెగేసి చెప్పారు. మధ్యాహ్నం ఎండలో లబ్ధిదారులు రేవులోనే ఉండటంతో వారికి భోజనాలు అక్కడికే తీసుకువచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఇసుక కోసం టిప్పర్‌ను పిలిపించటంతో తవ్వకాలను అడ్డుకునేందుకు రైతులు, స్థానిక నేతలు రేవులోకి వచ్చారు.

ఇరుపక్షాల వాగ్వాదం

టిప్పర్‌తో తవ్వకాలకు సిద్ధమవుతుండగా రైతులు నిలదీశారు. లే అవుట్ పేరుచెప్పి ఇసుక బయటకు విక్రయిస్తున్నారనీ, ఉప్పునీటి చొరబాటును ఆపే దిబ్బలు తవ్వటం పంట పొలాలకు తీవ్ర నష్టమని తెలిపారు. లేఅవుట్‌కు వచ్చే మెరకను అడ్డుకోవటం సరికాదని మహిళలు తెలిపారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

అధికారుల రంగప్రవేశం

సమాచారం అందుకున్న చల్లపల్లి ఇన్‌చార్జి ఎస్ఐ ప్రతాపరెడ్డి సంఘటనా ప్రదేశానికి వచ్చి ఇరుపక్షాలతో మాట్లాడారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు, తహసీల్దార్‌కు తెలియజేయటంతో తహసీల్దార్ బి.సుమతి అక్కడకు వచ్చారు. లే అవుట్‌కు ఇసుక తోలకంపై అభ్యంతరాలు తెలుసుకున్నారు. సీఆర్‌జడ్ పరిధిగా కోర్టు సూచించిన కారణంగా ఎప్పటినుంచో తవ్వకాలు నిలుపుదల చేశారనీ, గతంలో క్వారీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోర్టు ఆదేశాల ప్రకారం డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి ఇచ్చేయటం జరిగిందని పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్ బాబు తెలిపారు. సీఆర్‌జడ్ పరిధిలో ఉన్నట్టు గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆర్టీఐ సమాచారాన్ని ఫోన్‌లో న్యాయవాది కొర్రపాటి వీరసింహుడు తహసీల్దార్‌కు చూపించారు. లే అవుట్ కోసమని తవ్వకాలు చేపట్టి బయటకు విక్రయిస్తున్నారనీ, లే అవుట్ మెరక కోసం అనుమతి ఇస్తే ఇష్టానుసారం తవ్వుతారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని తహసీల్దార్‌కు చూపి ఉప్పునీటి చొరబాటు గురించి వివరించారు. ఇసుక కోసం ఉదయం నుంచీ ఇక్కడే ఉన్నామనీ, తమ లే అవుట్‌కు మెరక తోలేందుకు చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఇరుపక్షాల్లో ముఖ్యులను మంగళవారం ఉదయం కార్యాలయానికి రావాలనీ, సీఆర్‌జెడ్ పరిధిని పేర్కొంటూ ఉన్న ఉత్తర్వులను గానీ, కోర్టు డాక్యుమెంట్స్‌ను గానీ తీసుకురావాలని తహసీల్దార్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మాతంగి వేణు, రైతు ప్రముఖులు నాదెళ్ల వెంకట నరసయ్య, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇసుక దొంగలపై చర్యలు తీసుకోండి

» పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే బోడె, జనసేన నేత తాతపూడి గణేష్

పెనమలూరు, ఫిబ్రవరి 5 : గత రెండు నెలలుగా చోడవరం ఇసుక రేవులో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతూ కోట్లలో ప్రజాధనాన్ని దోచుకుంటున్న వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్‌లు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్వారీ అప్పగించామని మైనింగ్ శాఖ చెబుతోందని, పర్యావరణ అనుమతులు, కలెక్టరు ప్రొసీడింగ్స్, సర్వే నంబర్లు, మైనింగ్ చెయ్యాల్సిన వైశాల్యం లేకుండా ఆ సంస్థ పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ సంస్థకు మైనింగ్ అనుమతులు ఇస్తే మంత్రి జోగి రమేశ్ అనుచరులకు రీచ్‌లలో పనేమిటని ప్రశ్నించారు. నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్న మరుక్షణమే ఇసుక క్వారీలను స్వాధీనం చేసుకొని అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రెండు వందల టిప్పర్లలో ఇసుకను తరలిస్తూ రోజుకు కనీసం పాతిక లక్షలు పోగేసుకుంటున్నాడని ఆరోపించారు. లోకేశ్ రెడ్‌బుక్ లాగా తాను కూడా వైసీపీ తొత్తులైన అధికారుల వివరాలను నమోదు చేస్తున్నానని, అధికారంలోకి వచ్చిన మరుక్షణం ప్రభుత్వ కొమ్ముకాసే అధికారులపై విచారణ జరిపించి తగు చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. తాతపూడి గణేశ్ మాట్లాడుతూ, ఒకే బిల్లు మీద పది నుంచి పదిహేను టిప్పర్లను తోలడంతో ఎంత అక్రమ సొమ్ము వైసీపీ నేతల జేబుల్లోకి వెళుతుందో ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

» ప్రజా సేవకుడిగా పనిచేస్తా

» నియోజకవర్గ ప్రజలకు వర్ల కుమార్ రాజా అభ్యర్థన





నిమ్మకూరు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కుమార్‌రాజా, పామర్రులో పాదయాత్ర

పామర్రు, ఫిబ్రవరి 5 : సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు.. అన్న ఎన్టీఆర్ నినాదం స్ఫూర్తిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తనను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఆదరించాలని పామర్రు టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా కోరారు. గ్రామాల్లో ప్రజల కష్టాలను ఆలకించేందుకు సోమవారం పామర్రులో 'పల్లె బాట-పల్లె నిద్ర' కార్యక్రమానికి స్వీకారం చుట్టారు. పాదయాత్ర ప్రారంభానికి ముందుగా ఆయన ఇంటివద్ద తల్లిదండ్రులు వర్లరామయ్య, జయప్రదల ఆశీర్వచనం పొంది నిమ్మకూరులో టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పామర్రులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ పాలనను రాష్ట్ర ప్రజలు భరించే స్థితిలో లేరన్నారు. గ్రామాల్లో జెట్యాక్స్ మద్యంతో మందుబాబులను జలగల్లా పైసలు దోచేస్తూ వారిని తీవ్ర అనారోగ్యాలకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్‌కు పేదవాళ్ల బాధలు పట్టడంలేదని ఆరోపించారు. కుమార్ రాజాకు సంఘీభవం తెలిపేందుకు వచ్చిన పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఏపీ భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాల్సిన అవశ్యకతను వివరించారు. జగన్ అనే రాక్షసుడి వల్ల అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయయన్నారు. అక్రమార్జనతో వ్యవస్థలను చిన్నాభిన్నం చేసిన సీఎం జగన్ కురుక్షేత్రంలో అర్జునుడిగా తనను పోల్చుకోవడం ఎంత మాత్రం సరికాదని ప్రజలు గ్రహించాలన్నారు. పెడన టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, నియోజవర్గ అభివృద్ధి కోసం వర్ల కుమార్‌రాజాకు ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు.

పాదయాత్రకు ప్రజల నీరాజనాలు..

పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్‌నుంచి ప్రారంభించిన వర్లకుమార్‌రాజా పాదయాత్రకు ప్రజలు పార్టీ శ్రేణులు నీరాజనాలు పలుకుతూ, బాణసంచా కాల్పులు, డప్పువాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి జరగలేదని ప్రజలు కుమార్ రాజా దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ, గత ఎన్నికల్లో మెజార్టీనిచ్చి గెలిపించిన స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించాడన్నారు. గ్రామాల్లో కనీసం డ్రెయినేజీలు లేక అపరిశుభ్రత, దోమల సమస్య పీడిస్తున్నా కనీసం పట్టించుకునే వారే లేకుండా పోవడం ప్రజలు గమనించాలన్నారు. పల్లెబాట పాదయాత్ర పామర్రు, జుజ్జువరం, పసుమర్రు, నిభానుపూడి, ఉండ్రపూడిగ్రామం వరకు సాగింది. పాదయాత్రలో గ్రామాల్లో వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను ఏకరవు పెట్టి, వినతిపత్రాలు అందజేశారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా నిర్ణయాలు ఉంటాయని భరోసా కల్పించారు. కాబోయే ఎమ్మెల్యే కుమార్ రాజా అంటూ టీడీపీ, జనసేన శ్రేణులు పార్టీ జెండాలతో జేజేలు పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, సీనియర్ నాయకులు గొట్టిపాటిలక్ష్మీదాసు, వల్లూరిపల్లి గణేష్, జక్కా శ్రీనివాసరావు, మండపాక శంకరబాబు, నన్నపనేని వీరేంద్ర, వీరపనేని శివరాం వీరంకి వెంకటగురుమూర్తి, ఈడేనాని,నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీశ్రేణులు,అభిమానులు పాల్గొన్నారు.

నాబిడ్డను అదరించండి : వర్ల రామయ్య

తనబిడ్డ వర్లకుమార్‌రాజాను ఆశీర్వదించి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా పంపించాలని రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ప్రధాన కార్యదర్శి వర్లరామయ్య నియోజకవర్గ ప్రజలను అభ్యర్థించారు. 2014 ఎన్నికల్లో తాను స్వల్పతేడాతో ఓటమి చెందినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించానన్నారు. అనంతర పరిణామాలు ప్రజలందరికి తెలిసిందేనన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ అధినేత చంద్రబాబు విదేశాల్లో చదువుకుని వ్యాపారంలో స్థిరపడిన కుమార్‌రాజాను పామర్రునియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి కుమార్ రాజా అందరితో మమేకమై ప్రజాభిమానం సంపాదించడం తనకు ఎంతో ఆనందం కల్గించిందని, ప్రజలు నిండు మనస్సుతో దీవించాలని భావోద్వేగంతో చెప్పారు.

పింఛన్ టెన్షన్!

» వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని 80 మందికి నిలిపివేత

» ప్రభుత్వం ఆదుకోవాలని లబ్ధిదారుల ఆవేదన



రెండేళ్లుగా మంచంపైనే తోట రాధాకృష్ణ

మోపిదేవి, ఫిబ్రవరి 5 : అర్హులందరికి పింఛన్ మంజూరు చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం.. దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కాలేదు. మండలంలో 80 మందికిపైగా 18 నెలలు నుంచి, 60 మంది ఆరు నెలల క్రితం వివిధ రకాల పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత జూన్ నెలలో 20 మందికి పింఛన్లు మంజూరు కాకపోవటంతో వచ్చే జనవరిలో వస్తాయని గ్రామ, మండల స్థాయి అధికారులు నచ్చజెప్పారు. జనవరిలో 198 మందిని అర్హులుగా గుర్తిస్తూ మండల కార్యాలయం నుంచి నివేదిక పంపారు. జనవరి నెలకు 118 మందికి వివిధ రకాల పింఛన్లకు సంబంధించి నగదు పంపిణీ చేశారు. అర్హత కలిగి పింఛన్ మంజూరు కాని 80 మంది గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల వద్దకు వెళ్లగా, 30వ తేదీలోగా రెండో విడత జాబితా వస్తుందని, అప్పుడు నగదు పంపిణీ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ గడిచినా పింఛన్లు మంజూరు కాకపోవటంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్నా పింఛన్లు మంజూరు చేయకుండా ప్రభుత్వం దగా చేస్తున్నదని.. అధికారుల తప్పిదమా? ప్రభుత్వ నిర్లక్ష్యమా అని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాల్సిందిగా లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏడాదిన్నరగా పింఛన్ లేదు..

- కిలారు ప్రసూనాంబ



సంవత్సరంన్నర కాలంగా వితంతు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను. భర్త చనిపోవటంతో ఆసరాగా ఉంటుందని 18 నెలల క్రితం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవటం జరిగింది. ఇప్పటికి మూడు విడతలుగా మంజూరైన జాబితాల్లోనూ పింఛన్ మంజూరు కాలేదు.

కుంటిసాకులు చెబుతున్నారు

-కొక్కిలిగడ్డ సుధాకర్ (62), బోడగుంట



ఆరు నెలల క్రితం వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. వెబ్‌సైట్‌లో వివరాలు కనిపించటం లేదు. పింఛన్ రాలేదని చెబుతున్నారు. గ్రామ సచివాలయం నుంచి అర్హత ఉన్నట్టు చెప్పారు. మండల స్థాయి అధికారుల వద్దకు వెళ్లకు సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలి.

అనారోగ్యంతో దిక్కుతోచడంలేదు

- తోట రాధాకృష్ణ, పెదకళ్లేపల్లి

అనారోగ్యంతో రెండేళ్లుగా మంచంపైనే ఉంటున్నా. కనీసం మందులకు వస్తాయని 18 నెలల క్రితం పింఛన్‌కు దరఖాస్తు చేశా. పలు సాకులతో రెండు విడతల్లోనూ పింఛన్ జాబితాలో నమోదు కాలేదు. కుటుంబ జీవనం కష్టతరంగా ఉంది. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి.

జనవరిలో వస్తుందన్నారు..

- అరజా రామకృష్ణ, పెదకళ్లేపల్లి



కుటుంబ జీవనాధారానికి ఆసరాగా ఉంటుందని దరఖాస్తు చేసుకున్నా. ఐదు నెలల క్రితం గ్రామ సచివాలయంలో అర్జీ ఇచ్చా. జనవరిలో వస్తుందని తెలిపారు. జనవరి 3, 4 తేదీల్లో అడగ్గా, మరో జాబితాలో వస్తాయని తెలిపారు. ఫిబ్రవరిలో సచివాలయంలో అడుగ్గా, కొద్ది రోజుల్లో జాబితా వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలి.

మోసపూరిత వాగ్దానాలు ఆపాలి

- మండలి బుద్ధప్రసాద్



మోసపూరిత వాగ్దానాలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ పెద్దలు ప్రజలను నమ్మించే ప్రయత్నం కట్టి పెట్టాలి. అర్హులైన ప్రతీఒక్క లబ్ధిదారునికి సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేయాలి. లబ్ధిదారులు ఆరునెలలుగా ఎదురుచూస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేదు. పింఛన్ల పంపిణీలో దురాగతాలకు పాల్పడటం హేయకరమైన చర్య



ముఖ్యమంత్రి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్న డాక్టర్ చంద్రశేఖర్ రావు, రామ్ చరణ్

నా కుమారుడికివ్వండి

» ముఖ్యమంత్రిని కోరిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు

అవనిగడ్డ, ఫిబ్రవరి 5 : అవనిగడ్డ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన ప్రముఖ కేన్సర్ వైద్యుడు, దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు డాక్టర్ చంద్రశేఖర్‌రావు సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే వయస్సు రీత్యా తాను ఎన్నికల్లో పోటీ చేయలేనని, బదులుగా తన కుమారుడు సింహాద్రి రామ్‌చరణ్‌కు అవనిగడ్డ సీటు ఇవ్వాలని సీఎంను కోరినట్టు తెలుస్తోంది. తన కుమారుడు రామ్‌చరణ్ అయితే ఉత్సాహంగా పనిచేస్తాడని, అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వైసీపీ గెలుపుకోసం ప్రయత్నిస్తాడని చంద్రశేఖర్ సీఎంకు చెప్పినట్టుగా సమాచారం. మూడుతరాలుగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉంటూ అవనిగడ్డకు సేవలందించిందని, సింహాద్రి రామ్‌చరణ్‌ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరుతున్నట్టు చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. దీంతో కొద్దిరోజులుగా సింహాద్రి చంద్రశేఖర్‌రావు ఎన్నికల బరిలో నిలబడతారా? లేదా? అన్న విషయమై అవనిగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న చర్చకు ఎట్టకేలకు తెర పడింది.

గాంధీ బ్యాంకుపై ఆరోపణల్లో నిజం లేదు

» బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు

» విచారణ జరుగుతుండగా ఎలా చెబుతారు..

» బ్యాంకు డైరెక్టర్లు సుబ్బారావు, నాగేశ్వరరావు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

వేలాది మంది ఖాతాదారులతో గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకమండలి చెలగాటమాడుతోంది. పాలకమండలి సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు.. ఆరోపణలతో బ్యాంకు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. చైర్మన్‌పై పాలకమండలి సభ్యులు ఏడుగురు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడంతో పాలకమండలి నడుమ విబేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావు (చిన్ని) మొదటిసారి తన వాదన వినిపించారు. విలేకరులతో మాట్లాడుతూ.. తమపై చేసిన ఫిర్యాదులన్నీ ఫోర్జరీ సంతకాలతో చేసినవని, ఇద్దరు డైరెక్టర్లు తాము సంతకాలు పెట్టలేదని చెబుతున్నారంటూ ఆరోపించారు. బ్యాంకుపై వస్తున్న ఆరోపణలు నిజం కావన్నారు. కొత్త శాఖ ఏర్పాటుకు విశాఖపట్నంలో స్థల పరిశీలన పాలకమండలి ఆమోదం మేరకే జరిగిందని చిన్ని తెలిపారు. అంతా నిబంధనల ప్రకారమే చేశామని చెప్పిన ఆయన.. భవన యజమానికి ఒప్పందానికి ముందే డబ్బులు ఎందుకు చెల్లించాల్సి వచ్చిందన్న దానిపై స్పందించలేదు. విశాఖపట్నంలో కొత్త శాఖకు పాలకవర్గం ఆమోదం తెలిపిన తీర్మానం కాపీని ఇవ్వడానికీ నిరాకరించారు. కొత్త శాఖ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఉందా అన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు. కాగా చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించిన బ్యాంక్ డైరక్టర్లు తల్లాప్రగడ సుబ్బారావు, కళ్లే నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. బ్యాంకులో జరుగుతున్న అవకతవకలపై చైర్మన్ వక్రభాష్యం చెబుతున్నారన్నారు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా కొత్త శాఖ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పాలకమండలి సమావేశంలో కొత్త శాఖ ఏర్పాటుకు సంబంధించిన అజెండా అంశం లేదని, అలాంటప్పుడు దానికి ఆమోదం ఎలా ఉందని చెబుతారని నిలదీశారు. బ్యాంకు అక్రమాలపై తాము చేసిన ఫిర్యాదులపై కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణ చేస్తుండగా, ఎటువంటి అవకతవకలు జరగలేదని చైర్మన్ ఎలా చెబుతారని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి షటిల్ విజేత విజయవాడ

మైలవరం, ఫిబ్రవరి 5 : వెల్వడంకు చెందిన బండి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బండి నరేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఎస్ బాడ్మింటన్ ఎరినాలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల డబుల్స్ షటిల్ టోర్నమెంట్ విజేతగా విజయవాడకు చెందిన కిరణ్‌మౌళి, చంద్రగోపీలు మైలవరానికి చెందిన సాయి చరణ్, వంశీ జట్టుపై గెలిచి విజేతలుగా నిలిచారు. 60 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో విజయవాడ విన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.25 వేల నగదు బహుమతి, రన్నర్స్‌కు ట్రోఫీ రూ.20 వేల నగదు బహుమతి, నరసరావుపేటకు చెందిన ధీరజ్, ధనుష్‌లకు తృతీయ బహుమతిగా రూ.15 వేలు అందజేశారు.

విస్సన్నపేట ఎమ్మీవోపై ఫిర్యాదు

విస్సన్నపేట : విస్సన్నపేట ఇన్‌చార్జి ఎమ్మీవో-1 రాజశేఖర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉపాధ్యాయుల సమస్యలు గాలికొదిలేశారంటూ డీఈవో కార్యాలయంలో ఏడీ-1 డి.రాజేశ్వరికి సోమవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్యలు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు డిసెంబర్, జనవరి నెలల వేతనాల బిల్లులు సబ్‌మిట్ చేయలేదని, మండలంలోని ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తున్నారని, నూతిపాడు ఎంపీయుపీ పాఠశాలలో జూన్ నెలలో జరిగిన బదిలీ సందర్భంగా జీవోకు విరుద్ధంగా 50 శాతం ఉపాధ్యాయులను బదిలీచేశారని వినతిపత్రంలో యూటీఎఫ్ నాయకులు ఆరోపించారు.

దళిత బాలికపై అత్యాచారం

» పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 5 : తొమ్మిదో తరగతి చదువుతున్న దళిత బాలికపై ఒక యువకుడు, మరో మైనర్ (17) కలిసి అత్యాచారానికి పాల్పడిన ఘటన యాకమూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకమూరుకు చెందిన బాలిక(14) కూచిపూడి బాలికల హాస్టల్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు యాకమూరుకు చెందిన బోలెం దిలీప్(21)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కొన్నిరోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టుకుంటు సన్నిహితం అయ్యారు. ఆదివారం కూచిపూడి హాస్టల్ నుంచి యాకమూరు ఇంటికి వచ్చింది. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో సదరు బాలిక దిలీప్‌తో మాట్లాడేందుకు బయటకు వచ్చింది. దిలీప్, మైనర్ బాలుడితో కలిసి బాలికను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని యాకమూరు శివారు తోట్లవల్లూరు రోడ్డులోని రియల్ ఎస్టేట్ ప్లాట్లలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులిద్దరిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. డీఎస్పీ వెంట సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్సై పి.విశ్వనాథ్ ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	238
చికెన్ స్కిన్‌లెస్	248

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.43

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

ఈడుపుగల్లు (కంకిపాడు), ఫిబ్రవరి 5 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సర్పంచులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులతో అడ్డుకోవడం దుర దృష్టకరమని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. చలో అసెంబ్లీ కార్యక్ర మాన్ని అడ్డుకునేందుకు రెండు రోజులు ముందుగానే సర్పంచ్‌ను గృహ నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న తమను అక్రమంగా అడ్డుకోవడం సరికాదన్నారు. సమస్య లు పరిష్కంచకుండా పోలీసుల ద్వారా తమను అణిచి వేసేందుకు సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమిస్తామన్నారు.

గ్రీన్‌సిటీలో నేడు వైద్యశిబిరం

పెనమలూరు, ఫిబ్రవరి 5 : తాడిగడప డొంక రోడ్డులోని గ్రీన్‌సిటీలో నేడు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రీన్‌సిటీ డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ శేషగిరిరావు తెలిపారు. గన్నవరం పిన్నమనేని పాలీక్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్యశిబిరంలో స్థానికులకు షుగరు, బీపీ, దంత పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఉప్పలూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

ఉప్పలూరు (కంకిపాడు), ఫిబ్రవరి 5 : పోలింగ్ కేంద్రాలలో అసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఎం. రామకృష్ణ ఆదేశించారు. ఉప్పలూరులోని 200, 201, 202, 203, 204 పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల సమయానికి పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, మరగుదొడ్లు, విద్యుత్ సదుపాయం వంటి సౌకర్యాలను సరి చూసుకోవాలన్నారు. అదే విధంగా ఉప్పలూరులో అర్హులందరికీ నివేశాన స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వంగా కలిసారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి దుర్గారావమ్మ, ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 : కార్యకర్తలే టీడీపీకి బలమని అలాంటి కార్యకర్తల కటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. వీరవల్లికి చెందిన కొప్పెర్ల లక్ష్మణరావు(63) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందగా భౌతిక కాయానికి తెలుగు యువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్రతో కలిసి యార్లగడ్డ సతీష్ నివాళులర్పించారు. మృతుడి మనుమడు హేమంత్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ లంక అజయ్, కలపాల రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పెనమలూరు, ఫిబ్రవరి 5 : పెనమలూరు మండలానికి నూతన తహసీల్దారుగా సీఎస్డీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ రాష్ట్ర వ్యాప్త బదిలీలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పని చేస్తున్న వీఎస్డీ ప్రసాద్‌ను పెనమలూరు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అవసరమైన సేవలను వీలయినంత త్వరగా, పారదర్శకంగా అందిస్తామని తెలిపారు.

● గన్నవరం(ఉంగుటూరు) : గన్నవరం తహసీల్దార్‌గా ఎం.సీతాపవన్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈయన గన్నవరానికిబదిలీ అయ్యారు. నూతన తహసీలార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో సాదర స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

పాలనలో ప్రభుత్వ విఫలం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్





ఉయ్యూరులో టీడీపీ మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న బోడె ప్రసాద్.. కోలవెన్నులో బోడె హేమ..

ఉయ్యూరు, ఫిబ్రవరి 5 : వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉయ్యూరు 8వ వార్డులో సోమవారం పర్యటించి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి వైసీపీపై ధ్వజ మెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉయ్యూరులో పేదలకు బహుళ అంతస్తుల్లో టిడ్కో ఇళ్ల నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మాణం ప్రారంభించి మూడొంతుల పనులు పూర్తిచేస్తే వైసీపీ వాటిని పాడుపెట్టిందని ఆరోపించారు. తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కౌన్సిలర్ సుధారాణి, సంగెపు రంగారావు, ఈడే అంజిబాబు, జయదేవ్, అప్పలనాయుడు, నాగరాజు, నరేశ్, చిరంజీవి, అర్జునరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

రానున్నది రామరాజ్యమే..

కంకిపాడు : రాష్ట్రంలో రానున్నది రామరాజ్యమే అని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ అన్నారు. మండలంలోని కోలవెన్నులో సోమవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ విధి విధానాలతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. రాష్ట్రంలో రానున్నది రామరాజ్యమే అని అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, జగదీష్, మూల్పూరి కల్యాణి, తట్టుకూరి సురేష్, ఇమ్మానుయేలు, కొండా నాగేశ్వరరావు, వెంకటరమణ, కంచర్ల మోహన్ పాలడుగు సత్యనారాయణ, కుమార్, లాం ఆనంద్, వడ్డేపల్లి దిలీప్, ప్రసాద్, కాటూరి ప్రమోద్ పాల్గొన్నారు.

●తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు దేవినేని గౌతమ్ అన్నారు. మారేడుమాకలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్‌రావు, రామ్, పండు, నాని పాల్గొన్నారు.

●తెన్నేరులో సోమవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్ రామ్‌తో పాటు ఉద్దండి కుటుంబరావు, జె. నాని, యార్లగడ్డ రాజా, లంకా నాగబాబు, ఆర్ గంగాధర్, ఎన్ మన్మధరావు, కె. కిషోర్, యలమంద, యార్లగడ్డ మధుసూదనరావు, దండమూడి లక్ష్మీ, కొడాలి సాయిబాబు, కె. ప్రతాప్, కె. పండు పాల్గొన్నారు.

అన్ని వ్యవస్థలు పతనం..

పెనమలూరు : నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ సైకో జగన్‌రెడ్డి పతనం చేశాడని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం యనమలకుదురు 53, 54 బూత్‌ల పరిధిలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన సైకో జగన్‌రెడ్డి బూటకపు బటన్ నొక్కుళ్లతో ఇంతకాలం కాలక్షేపం చేశాడని ఎద్దేవా చేశారు. ఇసుక, బుసక, అక్రమ మైనింగ్, నాసిరకం మద్యం ఇలా అన్ని రంగాల్లో అవినీతి ఏరులై పారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుబ్బు, బలగం కొండ, షేక్ షాహీనా తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో మొక్కపాటి ప్రచారం

టీడీపీ విజయమే ధ్యేయంగా పనిచేయాలి

ఉంగుటూరు పార్టీ శ్రేణులకు యార్లగడ్డ వెంకట్రావు దిశానిర్దేశం



విజయవాడలో జరిగిన ఉంగుటూరు మండల పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, ఫిబ్రవరి 5 : రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని టీడీపీ గన్నవరం ఇన్‌ఛార్జి యార్లగడ్డ వెంకట్రావు పార్టీశ్రేణులకు సూచించారు. మండలంలో సమస్యలు, పార్టీ బలోపేతంపైన ఆయన సోమవారం విజయవాడలోని తన కళ్యాణ మండపం (గ్రాండియ్యర్)లో మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, పార్టీపటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై గ్రామపార్టీ అధ్యక్ష, కార్యదర్శులకు దిశా-నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పలువురు గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు యార్లగడ్డ దృష్టికి తీసుకురాగా, అధికారంలోకి రాగానే ఖచ్చితంగా ఆయా గ్రామాల్లోని అన్ని సమస్యలను తీరుస్తానన్నారు. అలాగే పార్టీ కష్టకాలంలో నిలబడిన ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుని వారిని అన్ని విధాలుగా ఆదు కుంటానని నాయకులందరికీ భరోసా ఇచ్చారు. మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. దీంతోపాటు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిపై సత్వరమే స్పందించి, తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, మండలంలోని 27గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు!

●నత్తనడకన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ●పడిగాపులు పడుతున్న సిబ్బంది



బాపులపాడు-3 సచివాలయంలో వేలిముద్రల కోసం వేచి ఉన్న మహిళలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 5 : పేదలకు పంపిణీ చేసిన ఇళ్లపట్టాలు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి సర్వర్ పనిచేయక పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పడిగాపులు పడుతున్నారు. పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను హక్కు భుక్తం చేసే ఉద్దేశంతో ఉచితంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా మూడు రోజుల కిందట బాపులపాడు మండలంలో చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సర్వర్ సక్రమంగా స్పందించకపోవడంతో మందకొడిగా సాగుతోంది. మండలంలో 3,464 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు షుమారు వెయ్యిలోపు మాత్రమే రిజిస్ట్రేషన్లు మొదటి ప్రక్రియ సచివాలయం స్థాయిలో పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్ మొదటి ప్రక్రియలోనే సర్వర్ సమస్యతో రెవెన్యూ, సచివాలయం సిబ్బంది గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. వారితో పాటు లబ్ధిదారులు కూడా సచివాలయాలు వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. దీంతో పాటు కొంత మంది లబ్ధిదారుల పేర్లు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో కనిపించకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సివస్తోంది. ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల పేర్లను ఎంట్రీ చేసిన కొంత మంది పేర్లు కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పట్టాలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు గ్రామాల్లో ప్రచారం చేయడంతో ఎంతో ఆశతో వెళ్లిన లబ్ధిదారులు సర్వర్ సమస్యతో ఇబ్బందికి గురవుతున్నారు. లబ్ధిదారులైన మహిళ అన్ని పనులు మానుకొని సచివాలయాలు వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయ సేవలు వినియోగించుకోవాలి

జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య



న్యాయసేవలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య

గన్నవరం(ఉంగుటూరు), ఫిబ్రవరి 5 : న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సహాయాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సివిల్‌జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలపై సోమవారం గన్నవరం సబ్‌జైలులో రిమాండ్‌లో వున్న నిందితులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన చట్టాలు, హక్కులు, న్యాయ సలహాలు, సేవలపై నిందితులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి జయలక్ష్మి, ప్యానల్ లాయర్ వై ఆర్ శారద, పారాలీగల్ వలంటీర్ రామినేని రవి, డిప్యూటీ జైలర్ బి.రాంబాబు, బి.శారద, లీగల్ సర్వీసెస్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల దేవస్థానానికి గార్బేజ్ ట్రక్కు వితరణ



ట్రక్కును ప్రారంభిస్తున్న ప్రభుకాంత్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 : దేవస్థానంకు వచ్చే భక్తులకు సేవలం దించే విధంగా నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వితరణ చేయడం అభినందనీయమని తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్ అన్నారు. ద్వారకాతిరుమల దేవస్థానానికి నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ వారందించిన గార్బేజ్ ట్రక్కును సోమవారం తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్ ట్రస్ట్ అధినేత నుగలాపు వెంకటేశ్వరరావుతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కానుమోలు కుమార్, ట్రస్ట్ కార్యదర్శి నుగలాపు వెంకట సురేష్‌బాబు, సూర్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఓటర్ల మనోభావాలను గుర్తించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప్పలపాటి ప్రవీణ్

గుణదల, ఫిబ్రవరి 5 : ఓటర్ల మనోభావాలకు అనుగుణంగా నేడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు అడుగులు వేయడం జరుగుతుందని, అందుకను గుణంగా ఓటర్ల మనోభావాలను గుర్తించాలని ఇంటిర్ గ్రేడ్ ట్రైనింగ్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి ప్రవీణ్ తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాను సారం విజయవాడ రూరల్ మండలంలోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్-3లో బీఎల్ఏ యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం సోమవారం జరిగింది. క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు యుగంధర్ సమక్షంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఓటరు నాడి ఏమిటి, రాబోయే రోజుల్లో అధికారంలోకి రానున్న టీడీపీ నుంచి ఏమి ఆశిస్తున్నారన్నది గ్రహించి అధిష్టానానికి నివేదిక రూపంలో పంపాలని తెలిపారు. నేడు నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టడంలో టీడీపీ ముందంజలో ఉండేలా ప్రణాళికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు గొడ్డళ్ల చినరామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావు, మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు కానూరు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళాభ్యున్నతి సాధ్యం



మల్లవల్లి తెలుగు మహిళ కార్యవర్గం

హనువమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 : మహిళలకు అధిక ప్రాధాన్యతని స్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నది టీడీపీ మాత్రమేనని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. మల్లవల్లి టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో తెలుగు మహిళ కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగు మహిళా కమిటీ అధ్యక్షురాలిగా అక్కినేని స్వరూప రాణి, కార్యదర్శిగా గజ్జల రంగమ్మతో పాటు 12మందితో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తూము కల్పనాదేవి, అచ్చి వసంత కుమారి, మందాడ చల్లమ్మ, మల్లవల్లి మరియమ్మ, షేక్ షమీమ్, అచ్చి ఇందు, వేముల మంగమ్మ, కోటేశ్వరమ్మ తదితర సభ్యులతో పాటు గ్రామ కమిటీ అధ్యక్షుడు యనమదల వెంకయ్యారావు, అక్కినేని ధర్మరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరిక

యువదళం బహిరంగ సభలో సాదరంగా ఆహ్వానించిన నేతలు



దంటగుంట్ల సర్పంచ్, ఉపసర్పంచ్‌ని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యార్లగడ్డ

గన్నవరం(ఉంగుటూరు)/ హనుమాన్ జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 5 : యువదళం బహిరంగ సభలో నియోజకవర్గంలోని పలుగ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేష్, గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం ఎంపీటీసీ జోగా మల్లీశ్వరి, బాపులపాడు మండలం దంటగుంట్ల సర్పంచ్ యజ్జవరపు వెంకటరంగారావు, ఉపసర్పంచ్ పల్లి రవిబాబు, ఆర్బీకే అధ్యక్షుడు యజ్జవరపు శ్రీనివాసరావు, మాజీగ్రామ వైసీపీ అధ్యక్షుడు యజ్జవరపు సత్యనారాయణ, పలువురు వార్డుసభ్యులతోపాటు నాయకులు సుమారు 50మంది టీడీపీలో చేరారు. బొమ్ములూరుకు చెందిన పాతూరి క్రాంతికుమార్, సొంగా నవదీప్, శాంతివర్ధన్, కలపాల సందీప్, పాతూరి శాంతిబాబు, పాతూరి బబ్లూ, వంటి వైసీపీ నాయకులు 30మంది, కొయ్యూరు సర్పంచ్ కొల్లి సత్యనారాయణ (నాని), కొల్లి రంగబాబు, మూల్పూరి ధనకోటేశ్వరరావు, పరసా నాగబాబు, జుజ్జువరపు ప్రకాష్, ముల్లంగి విజయబాబు తదితరులు 15మంది, బిళ్లనపల్లి గ్రామానికి చెందిన తోట శ్రీను, అబ్బ దాసరి నాగేశ్వరరావు, ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన మాగంటి రంగారావు, నెరుసు గోపాలకృష్ణ యాదవ్, బి.శేషు, బి.ప్రవీణ్‌కుమార్, పి.గణేష్, ఎం.అనిల్‌కుమార్, జె.బాలరాజు, గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన కలపర్తి అనిల్‌కుమార్, కూరేటి శ్రీనివాస్‌బాబు, కైలే సురేష్, పావులూరి ప్రదీప్, శ్రీకాంత్ తదితరులు 20మంది, కేసరపల్లి గ్రామ వైసీపీ యూత్ అధ్యక్షుడు బేతాళ ఈశ్వర్, జక్కులనెక్కలం గ్రామానికి చెందిన కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కాట్రు శ్రీనివాసరావు, అప్పారావు, వెంకటేశ్వరరావు, బాబు, బూతిమిల్లిపాడుకు చెందిన సతీష్, గన్నవరం గౌడపేటకు చెందిన ఆకాష్, ధనుష్, అంకా లు, స్వామి, శ్రీను, డేవిడ్, నరేష్ తదితరులు 23మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ యార్లగడ్డపార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పోటాపోటీగా ఫ్లెక్సీల ఏర్పాటు

ఉయ్యూరు. ఫిబ్రవరి 5 : ఉయ్యూరు నగర పరిధిలో రోడ్లపక్కన పోటా పోటీగా ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ ఫోటోతో సిద్ధం అని ఫ్లెక్సీలు దర్శనమిస్తుండగా పోటీగా మేము సిద్ధం అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫొటోతో ఫ్లెక్సీలు ఉయ్యూరులో ఏర్పాటు చేస్తున్నారు. కళాశాల రోడ్డులో సుందరమ్మ పేట ఫ్రెండ్స్ సర్కిల్ పేరుతో పవన్‌కల్యాణ్ ఫోటోతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	238
చికెన్ స్కిన్‌లెస్	248

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.43

ద్వారకా తిరుమలకు ట్రక్కు వితరణ



గుడివాడ : ద్వారకా తిరుమల దేవస్థానానికి నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధినేత నుగలాపు వెంకటేశ్వరరావు ట్రక్కును అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ మూల్పూరి ప్రభుకాంత్ మాట్లాడుతూ నుగలాపు కుటుంబసభ్యులు వెంకటసురేష్‌బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు వడ్డే గిరిబాబు, దేవస్థానం సభ్యులు కానుమోలు కుమార్, ఇంజినీరింగ్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్త పల్లెతుమ్మలపాలెంలో పర్యటిస్తున్న కొల్లు నీలిమ



చౌటపల్లిలో వెనిగండ్ల రాముకు స్వాగతం పలుకుతున్న నాయకులు



ఘంటసాల జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్



నడుపూరులో కాగిత సమక్షంలో టీడీపీలో చేరుతున్న సర్పంచ్ అనూష

సామాన్యుడు బతికే పరిస్థితి లేదు

● జగన్‌ను సాగనంపండి : బుద్ధప్రసాద్, వెనిగండ్ల, నీలిమ పిలుపు

మచిలీపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో సామాన్యుడు బతికే పరిస్థితి లేదని కొల్లు నీలిమ అన్నారు. బందరు మండలం కొత్త పల్లెతుమ్మలపాలెంలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కేపీటీపాలెంలో తాగునీటికష్టాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్నవారే లేరన్నారు. కొల్లు రవీంద్ర తాగునీటిని అందించేందుకు చిన్నాపురంలో 30 ఎకరాల్లో రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తే, స్థానిక వైసీపీ నాయకులు పథకాన్ని నిలిపివేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రొయ్యల చెరువులకు విద్యుత్ సబ్సిడీని వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందని, టీడీపీ అధికారంలోకి రాగానే విద్యుత్ సబ్సిడీ పునరుద్ధరిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకె నారాయణప్రసాద్, పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు, మత్స్యకారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ రమేష్, చల్లా సీతారామ్య, ఒడుగు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ కవచం టీడీపీనే : మండలి

ఘంటసాల : టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీ వర్గాలకు రక్షణ కవచంలా నిలిచిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఘంటసాలలోని విశ్వేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, స్వర్గీయ ఎన్టీఆర్ బీసీ, ఎస్సీఎస్టీ వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించారన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది టీడీపీనేనన్నారు. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం బీసీ వర్గాలకు ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని, స్వభావాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఎంత దోచుకున్నది జగన్మోహన్‌రెడ్డికి తెలుసని, అందుకే ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయటం సంతోషించదగ్గ విషయమే గానీ, ఆయన ఆలోచనా విధానాన్ని సీఎం ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరిబాబు, పరిశె చలపతి, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దిరిశం వెంకట్రావు, వేమూరి సాయి వెంకటరమణ, బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్, కొప్పనాతి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ అమలేశ్వరరావు, నారగం లక్ష్మణరావు, గుర్వాబత్తిన నాగేశ్వరరావు, దాసం రామకృష్ణ, తుమ్మలచర్ల మురళీకృష్ణ, గుత్తికొండ వరప్రసాద్, వీరంకి నాగరాజు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ విఫలం



గుడివాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము విమర్శించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం చౌటపల్లి గ్రామంలో నిర్వహించారు. ప్రజలు వెనిగండ్ల, రావిలకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి టీడీపీని ఎందుకు గెలిపించాలో వివరించారు. బాబు ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాలు వేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రహదారులకు మరమ్మతులు చేయించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. గ్రామ ప్రముఖులు, సీనియర్ టీడీపీ నాయకులు అట్లూరి వెంకట రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అట్లూరి నాగేంద్ర ప్రసాద్, మాజీ వీఆర్వో అట్లూరి గాంధీ, సూరపనేని నాగేశ్వరరావు, అట్లూరి గోపిచంద్ తదితర నాయకులను కలిశారు. మం డల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారథి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు పి.సాయి, ఎలకలేటి వెంకటేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, వర్రె నాగరాజు, నజీర్, బండారు సాయి, నాయకులు పాల్గొన్నారు.

నడుపూరులో భారీగా టీడీపీలో చేరిక

పెడన రూరల్ : టీడీపీ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం ఉంటాయని నడుపూరు సర్పంచ్ చీర్ల అనూష అన్నారు. పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నడుపూరు గ్రామంలో మాజీ సర్పంచ్ రాజనాల గౌతుమోహనరావు, పాల కేంద్రం అధ్యక్షుడు చీర్ల కృష్ణంరాజు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు చీర్ల శివకృష్ణమోహనరావు, ఉపసర్పంచి పామర్తి వెంకటేశ్వరరావుతదితరులతో కలసి 122 మంది టీడీపీలో చేరారు. కృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, జడ్పీటీసీ సభ్యులు అర్జా నగేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సురేష్, చీర్ల నవీన్ కృష్ణ, పెడన, గూడూరు మండల టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పోతన స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మోపిదేవి : ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శించారు. పెదప్రోలు, కప్తానుపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు రైతు దగా కేంద్రాలుగా మారాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత పరిశీలించేందుకు నియమించిన టెక్నికల్ అసిస్టెంట్లకు సరైన అవగాహన లేకపోవటంతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ధర విషయంలో మిల్లర్లతో సంబంధం లేకుండా రంగు మారిన, వర్షాలకు తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెండ్ల శరత్ చంద్రబాబు, రైతు నాయకులు నాదెండ్ల వెంకట్రామయ్య, మండవ పవన్ కుమార్ తదిరతులు ఉన్నారు.

నూతన తహసీల్దార్లు వీరే

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 : మచిలీపట్నం నార్త్, సౌత్ తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నార్త్ తహసీల్దార్‌గా పి.సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల నుంచి బదిలీపై వచ్చారు. మచిలీపట్నం సౌత్ తహసీల్దార్‌గా పి.లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గణపవరం నుంచి బదిలీపై వచ్చారు. **పెడన :** పెడన తహసీల్దార్‌గా ఆర్. రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. **గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా వై.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఆర్ఐ షకీలా బేగం, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. **గుడివాడ రూరల్ :** గుడివాడ తహసీల్దార్‌గా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. **పెదపారుపూడి :** పెదపారుపూడి తహసీల్దార్‌గా కె.వెంకట మాధవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కిర్లంపూడి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. మాధవరావు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. **కూచిపూడి :** మొవ్వ తహసీల్దార్‌గా సిహెచ్.వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి బదిలీపై వచ్చారు. **ఘంటసాల :** ఘంటసాల తహసీల్దార్‌గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసాపురం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. **పామర్రు :** పామర్రు తహసీల్దార్‌గా పి.శ్రీపల్లవి బాధ్యతలు స్వీకరించారు. **చల్లపల్లి :** చల్లపల్లి తహసీల్దార్‌గా బి.సుమతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలవరం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. డీటీ కుమార్, ఆర్ఐ జీఎస్ఆర్. కృష్ణమోహన్ స్వాగతం పలికి సత్కరించారు. **మోపిదేవి :** మోపిదేవి తహసీల్దార్‌గా మేడపాటి శ్రీవిద్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి ఆమె వచ్చారు. శ్రీవిద్యకు రెవెన్యూ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ తహసీల్దార్‌గా ఎం.సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోదావరి జిల్లా ఉండి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. **కోడూరు :** కోడూరు తహసీల్దార్‌గా టి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మారేడుమిల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న టి.శ్రీనివారావు కోడూరుకు బదిలీపై వచ్చారు. శ్రీనివాస్‌కు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. **నాగాయలంక :** నాగాయలంక తహసీల్దార్‌గా ఎం.సుందరరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం నుంచి ఆయన బదిలీపై వచ్చారు.

లాయర్ల దీక్షలకు రావి సంఘీభావం



మచిలీపట్నం టౌన్ : చంద్రబాబు అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు మూడు నెలలుగా నిర్వహిస్తున్న దీక్షాశిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. తుంగల హరిబాబు, కొట్టె రఘురామ్, రామకృష్ణ, ఫణికుమార్, పుప్పాల ప్రసాద్, కూనపరెడ్డి శ్రీనివాసరావు, పోతురాజు, నరసింహారావు, మధుసూదనరావు, మస్తాన్, అజ్మతున్నీసా బేగం పాల్గొన్నారు.

జెండా దిమ్మె తొలగింపు దారుణం



మచిలీపట్నం టౌన్ : జనసేన దళిత నాయకుడు కరుణాకర్ నిర్మించిన జనసేన జెండా దిమ్మెను వైసీపీ నాయకులు అధికార దర్పంతో తొలగించడం దారుణమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ధ్వజమెత్తారు. భాస్కరపురంలో జెండా దిమ్మె తొలగించిన స్థలాన్ని వేదవ్యాస్ సందర్శించి మీడియాతో మాట్లాడారు. అధికారులు వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గడ్డం రాజు, కొట్టె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ లలితాదేవి



మచిలీపట్నం టౌన్ : కమ్యూనిస్టు ఉద్యమాల్లో లలితాదేవి మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవానీ అన్నారు. భాస్కరపురంలో సోమవారం లలితా దేవి సంస్మరణ సభ జరిగింది. జొన్నవిత్తుల ఝాన్సీరాణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో దుర్గా భవానీ మాట్లాడుతూ, చల్లపల్లి భూ పోరాటాల సమయంలో లలితాదేవి అవిరళ సేవలందించారన్నారు. కె.వి.వి. ప్రసాద్, బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుందరరామరాజు, నార్ల వెంకటేశ్వరరావు, టి. తాతయ్య, మల్లిపెద్ది రత్నకుమారి, కట్టా హేమసుందరరావు, లింగం ఫిలిప్, వడుగు రత్నకుమారి, పి.రాణి, లలితాదేవి, దాలిపర్తి కృష్ణమూర్తి మాట్లాడారు.

విద్యార్థికి వేదవ్యాస్ రూ.10వేల ఆర్థిక సాయం

పెడన రూరల్ : చేవేంద్ర గ్రామానికి చెందిన అడపా తేజశ్రీకర్ తల్లిదండ్రులను కోల్పోయాడు. ప్రమాదవశాత్తూ చేయి విరిగింది. బాధితుడికి బూరగడ్డ వేదవ్యాస్ రూ. 10వేలు అందించారు. దాతలు ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీసీ నేత సాయం

అవనిగడ్డ రూరల్ : తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినులకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు సాయమందించారు. పల్లెపాలెంకు చెందిన చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని శ్రావణి, తొమ్మిదో తరగతి విద్యార్థిని రిషితలకు కట్టా నాగోజిరావు జ్ఞాపకార్థం సోమవారం రూ.10 వేల నగదును అందజేశారు. సర్పంచ్ దాసరి విజయ్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఆకుల బాబీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెడన తాగునీటి సమస్యను పరిష్కరించండి



మచిలీపట్నం టౌన్ : పెడన నియోజకవర్గంలో తాగునీటి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజబాబు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మలను మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. సోమవారం స్పందన హాల్‌లో కలెక్టర్‌ను కలసి సమస్యను వివరించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు తాగునీటి సమస్యను వివరించారు. గ్రామంలో చెరువులను నింపాలని కోరారు. కలుషిత నీరు వల్ల ప్రజలు డయోరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, సుగుణబాబు, కాగిత చంటి, ఏడుకొండలు, నాగబాబు, మానేపల్లి శ్రీనివాస్, పుప్పాల నరసింహారావు, మాజీ సర్పంచ్‌లు పుప్పాల పాండురంగారావు, అడ్డాల శేఖర్, జనసేన నాయకులు పట్టపు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను జేసీకి వివరిస్తున్న బంటుమిల్లి రైతులు

ఆరుతడి పంటలకు నీరివ్వాలి

బంటుమిల్లి : ఆరుతడి పంటలకు నీరు ఇవ్వాలని బంటుమిల్లి రైతులు జేసీకి మచిలీపట్నం స్పందనలో అర్జీ ఇచ్చారు. అర్తమూరు తదితర ప్రాంతాలలో దాదాపు 150 ఎకరాల భూమిలో అపరాలు సాగు చేస్తున్నారన్నారు. వర్షాలకు పంటలు దెబ్బతినగా అధికారులు సబ్సిడీపై విత్తనాలు అందజేశారని, నీటిని అందించకపోతే నష్టపోతామని అర్జీలో తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు. రైతు నాయకులు కంతమనేని మురళీ, బొర్రా కాశీ, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు మెట్ల నిర్మాణాన్ని అడ్డుకున్న పంచాయతీ సిబ్బంది

అవనిగడ్డ : మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద మెట్లు కట్టేందుకు ఆర్యవైశ్య సంఘం చేసిన ప్రయత్నాలను పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. దండలు వేసి నిలబడేందుకు స్థలం లేకపోవటంతో విగ్రహాలకు కుడివైపుగా దిమ్మెను పెంచి కట్టి మెట్లు ఏర్పాటు చేసేందుకు ఆర్యవైశ్య సంఘం సోమవారం పనులు ప్రారంభించారు. వేరే విగ్రహం పెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ పంచాయతీ సిబ్బంది కడుతున్న మెట్లను తొలగించి ఇటుకరాళ్లు, ఇసుకను బయటకు తరలించారు. కేవలం రాజకీయ కారణాలతోనే అధికారులు పనులను అడ్డుకుంటున్నారని ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘంటసాల రాజమోహనరావు ఆరోపించారు.

వంతెన పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కోడూరు : లింగన్నకోడుపై వంతెన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నరసింహాపురం గ్రామ సమీపంలో గత కొద్దికాలం క్రితం వంతెన కూలిపోయిందని, పునర్నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర రూ.18.40 లక్షలు, లోక్‌సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి రూ.25 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, డ్రైనేజీ శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు సత్కారం



అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఉత్తమ సేవలు అందించిన వారికి సన్మానం చేశారు. వడ్లమూడి శశికుమార్, కిరణ్, సౌమ్య, జరుగు పవన్ కుమార్‌తోపాటు పీడీలు ఉదయ్ కుమార్, భానుప్రకాష్‌లను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో మరియ కుమారి, ఎంపీపీ తుంగల సుమతిదేవి, ఉపాధ్యక్షుడుపులిగడ్డ పిచ్చేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డీ శైలజాకుమారి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు రెవెన్యూ అధికారికి..



గుడ్లవల్లేరు: ఉత్తమ సేవలు అందించిన గుడ్లవల్లేరు రెవెన్యూ అధికారి శాయిన మహంకాళీ ప్రకాష్‌ను జై భీమ్ యువ జన సేవా సంఘం, వాసవీ క్లబ్ సంయుక్తంగా సోమవారం సన్మానించాయి. డీటీ కనకదుర్గ, పంచాయతీ కార్యదర్శి జి..ఎల్.వి నరసింహారావు, జై భీమ్ యువజన సేవా సంఘం జాతీయాధ్యక్షులు గోత్రు నాగబాబు, వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మంటాడ వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.9.10 లక్షలు

మంటాడ (పమిడిముక్కల) : మంటాడ అలివేలు మంగ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కించగా 151వ రోజులకు రూ. 9,10,940 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారి మాధవీలత తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలోని కానుకలు లెక్కించినట్టు తెలిపారు.



కళాకారులకు సత్కారం

గుడివాడ : పట్టణ కళాకారుల సంఘం మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎన్‌జీవోస్ హోంలో పట్టణ కళాకారుల సంఘం మూడో వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన యలవర్తి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ మాట్లాడుతూ ప్రతి నెలా కళాకారులకు రూ.1000 చొప్పున సంఘం గౌరవాధ్యక్షుడు చింతయ్య అందజేయడం అభినందనీయమన్నారు. చింతయ్య, పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజా, కొండయ్య, కోశాధికారి కోటేశ్వరీ, సభ్యులు పాల్గొన్నారు.

క్షీరబంధు సాయం అందజేత

పెడన : నెరికేపాలెం రైతు మట్టా నాంచారయ్య మృతిచెందగా, కుటుంబ సభ్యులకు క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కు కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకట నగేష్ సోమవారం అందజేశారు. పామర్తి మణికుమార్, తోట సత్యనారాయణ, రాజ్ కుమార్, మోతుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.